సాక్షి
నిజామాబాద్
సోమవారం । 20 । మే । 2024



సమావేశాలకు స్వస్తి
కమ్యూనిటీ ఆస్పత్రుల్లో సమస్యలను గుర్తించడం కోసం నిర్వహించాల్సిన సలహా మండలి సమావేశాలకు స్వస్తి పలికారు.
- 8లో ▸



తాళం వేసిన ఇంట్లో చోరీ
కామారెడ్డి పట్టణంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. 9 తులాల బంగారం అపహరణకు గురైంది.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.4 /26.8

వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

క్రమశిక్షణతో ఉన్నతంగా ఎదగవచ్చు



ఆర్మూర్: క్రమశిక్షణ పాటించడం ద్వారా జీవితంలో ఉన్నతంగా ఎదగవచ్చని ప్రధాన మంత్రి కార్యాలయంలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఐఏఎస్ అధికారి విక్రమ్ సింహారావు సూచించారు. ఆర్మూర్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జోరుగా హుషారుగా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విక్రమ్ సింహారావు ఇంగ్లిష్, హిందీ భాషల్లో తాను రచించిన లైఫ్ స్టైల్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జానపద కళాకారులు నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు గోపీకృష్ణ, కార్యదర్శి తులసి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌కు బదులు టీజీగా మార్పు

సుభాష్‌నగర్: తెలంగాణ సంక్షిప్త పదాన్ని 'టీఎస్'కు బదులు 'టీజీ'గా మార్చాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో), నోటిఫికేషన్లు, నివేదికలు, లెటర్ హెడ్‌లలో తెలంగాణ సంక్షిప్త పదం టీజీగా పేర్కొనాలని ఆ ఉత్తర్వుల్లో సూచించిందన్నారు. ఈ మేరకు కేంద్రం అనుమతిస్తూ, గెజిట్ జారీ చేసిందని పేర్కొన్నారు. మార్చిలోనే వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అనుమతులు రాగా, తాజాగా అన్ని ప్రభుత్వ వ్యవహారాల్లో టీఎస్‌కు బదులు టీజీగా వ్యవహరించేందుకు అనుమతించిందని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలు, స్వయం ప్రతిపత్తి కలిగిన విభాగాలన్నీ దీనిని విధిగా పాటించాలని ఆదేశించారు. లెటర్ హెడ్లు, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్స్, పాలసీ పేపర్లు, ఇతర అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నింటిపై టీఎస్ స్థానంలో టీజీగా మార్చాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాల్లో టీఎస్‌కు బదులు టీజీగా మారుస్తూ ఈ నెల 26వ తేదీలోగా నివేదికలు సమర్పించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

అంతర్జాతీయ టెన్నిస్‌బాల్ క్రికెట్‌లో ప్రతిభ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కాంతి హైస్కూల్ పీఈటీ ఎం అఖిల్ అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించినట్లు కరస్పాండెంట్ గంగారెడ్డి తెలిపారు. శ్రీలంకలో ఈ నెల 17, 18, 19వ తేదీల్లో టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. అఖిల్ పోటీల్లో ప్రతిభ చాటి భారత జట్టు విజయానికి కృషి చేసినట్లు తెలిపారు. అలాగే గుజరాత్‌లో మే 28 నుంచి నిర్వహించనున్న జాతీయస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో కాంతి హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఆయన చెప్పారు.

పర్యాటక కేంద్రంగా 'సాగర్'



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టును అంతర్జాతీయ పర్యాట కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ఈ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పర్యాటక మంత్రి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. అమెరికాకు చెందిన తన మిత్రుడు, శాస్త్రవేత్త, డేస్టార్ నెట్‌వర్క్ ప్రతినిధి మార్క్ స్టీవెన్ విల్లెట్‌తో కలిసి నిజాంసాగర్ ప్రాజెక్టును ఎమ్మెల్యే ఆదివారం సందర్శించారు. గోల్ బంగ్లా, గుల్‌దస్తా, ఛత్రీబంగ్లా, ప్రాజెక్టు వ్యూ పాయింట్‌ను వారు తిలకించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వందేళ్ల చరిత్ర కలిగిన నిజాంసాగర్ ప్రాజెక్టు కట్టడాలు ఇప్పటికీ చెక్కు చెదర లేదని, అద్భుతమైన కట్టడాలు, ఇక్కడి కళానైపుణ్యత యావత్ దేశ ప్రజలను ఆకర్షించేలా పర్యాటకంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ప్రాజెక్టును గత పాలకులు దారుణంగా నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రాజెక్టు కట్టడాలను గత పాలకులు వాళ్ల సొంత సంబురాలకు వాడుకున్నారు తప్పా అభివృద్ధి చేయాలన్న సోయి వారికి లేకుండా పోయిందని విమర్శించారు.

ధాన్యం సేకరణ పూర్తి!

- 4.33 మెట్రిక్ టన్నులు కొనుగోలు
- రైతుల ఖాతాల్లో రూ.840 కోట్లు జమ
- సన్న రకాలను బహిరంగ మార్కెట్‌లో విక్రయించిన అన్నదాతలు



సుభాష్‌నగర్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు దాదాపుగా ముగిశాయి. 66,680 మంది రైతుల నుంచి 4,33,063 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ఇప్పటివరకు రూ.840 కోట్లు ధాన్యానికి సంబంధించిన డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేశారు. బహిరంగ మార్కెట్‌లో సన్నరకం ధాన్యానికి గిట్టుబాటు ధర దక్కడంతో రైతులు వ్యాపారులకు విక్రయించారు. రాష్ట్రంలోనే ధాన్యం సేకరణలో జిల్లా మొదటి స్థానంలో ఉన్నప్పటికీ.. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు సేకరణ జరగలేదు. గత రెండు, మూడు సీజన్లుగా అధికారుల లక్ష్యం నెరవేరడం లేదు. జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేసం 426 కేంద్రాలు ప్రారంభించారు. అందులో 46 ఐకేపీ, 374 సొసైటీ, డీసీఎంఎస్, మెప్మా 6 కేంద్రాలు ఉన్నాయి. సుమారు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సీజన్‌లో దాదాపుగా అన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు 4,33,063 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం అన్నిరకాల చర్యలు చేపట్టింది. ఒకవైపు ఎన్నికలు కొనసాగుతున్నా.. మరోవైపు ధాన్యం సేకరణపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు.

మంచి ధర రావడంతోనే..

జిల్లాలో ఈ సీజన్‌లో వరి సుమారు 4.16లక్షల ఎకరాల్లో సాగైంది. దాదాపు 11.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ధాన్యం ఉత్పత్తి ఆ మేరకే జరిగినప్పటికీ.. సేకరణ లక్ష్యాన్ని చేరుకోలేదు. సన్నరకం ధాన్యానికి బహిరంగ మార్కెట్‌లో రూ.2,200 నుంచి రూ.2500 వరకు పలికింది. దీంతో రైతులు వ్యాపారులకు విక్రయించారు. జిల్లా నుంచి కర్నాటక, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడుతో పాటు నల్గొండ, సూర్యాపేట్, తదితర జిల్లాలకు ధాన్యాన్ని వ్యాపారులు తరలించారు. కొన్నిచోట్ల రైస్‌మిల్లర్లు దొడ్డు రకాన్ని కూడా వ్యాపారుల ద్వారా కొనుగోలుచేశారు. గత సీజన్‌లోనూ లక్ష్యం విషయంలో ఇదే పరిస్థితి చోటుచేసుకుంది.

వారం రోజుల్లో డబ్బులు జమ

ధాన్యం విక్రయించిన వెంటనే ధ్రువపత్రాలు సమర్పించిన రైతులకు వారం రోజుల వ్యవధిలోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇప్పటివరకు రూ.960 కోట్ల విలువైన ధాన్యాన్ని 66,680 మంది రైతుల నుంచి సేకరించారు. 49,027 మంది రైతులకు రూ.840 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు. మరో రూ.18కోట్లు ఇండెంట్ పూర్తయ్యింది. మిగతా రైతులకు కూడా వారం, పది రోజుల వ్యవధిలో డబ్బులు జమ చేస్తామని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

రైతులకు ప్రయోజనం చేకూరింది

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపుగా ధాన్యం సేకరణ పూర్తయ్యింది. నిర్దేశించిన లక్ష్యం పూర్తి కాకపోయినప్పటికీ.. రైతులకు బహిరంగ మార్కెట్‌లో మంచి ధర వచ్చి ప్రయోజనం చేకూరింది. కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కలెక్టర్, అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో అన్ని చర్యలు చేపట్టాం. మిగతా రైతులకు కూడా త్వరలోనే డబ్బులు జమ చేస్తాం.
– జగదీశ్‌కుమార్, పౌరసరఫరాల సంస్థ మేనేజర్

డిగ్రీలో ప్రవేశాలకు దోస్త్

- ఈ నెల 29 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్స్
- 30 వరకు వెబ్ ఆప్షన్స్
- జూన్ 6న తొలి విడత సీట్ల కేటాయింపు



తెయూ(డిచ్‌పల్లి): డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) తొలివిడత రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఈ నెల 29న ముగియనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఆరు యూనివర్సిటీల (ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన)తో పాటు మహిళా యూనివర్సిటీ, జేఎన్‌టీయూ, సాంకేతిక విద్య, శిక్షణ బోర్డు పరిధిలోని కళాశాలల్లో బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బీబీఎం, బీఎస్‌డబ్ల్యూ, డీఫార్మసీ కోర్సుల్లో ఫస్టియర్ ప్రవేశాలను దోస్త్ ద్వారా నిర్వహిస్తారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దోస్త్ వెబ్‌సైట్ https://dost.cgg.gov.in లో రూ.200 ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇంటర్ మార్కుల ఆధారంగా ఆయా కాలేజీల్లో డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశాలు కల్పిస్తారు.

తెయూ పరిధిలో..

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 74 డిగ్రీ కళాశాలల్లో సుమారు 33,630 సీట్లు అందుబాటులో ఉన్నాయి. తెయూ పరిధిలోని 13 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 7,500 సీట్లు, 54 ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో 24,290 సీట్లు, ఏడు సాంఘిక, గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలల్లో 1,840 సీట్లు అందుబాటులో ఉన్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ సారి వర్సిటీ పరిధిలో కొన్ని అదనపు డిగ్రీ కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా బీకాం ఫైనాన్స్, బీఎస్సీ బయోమెడికల్ సైన్స్, బీఏ హానర్స్, బీఏ పబ్లిక్ పాలసీ లాంటి కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

మొదటి విడత

ఈ నెల 6 నుంచి తొలివిడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 29 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 20వ తేది నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. దివ్యాంగులు, ఇతర ప్రత్యేక రిజర్వేషన్లు ఉన్న వారికి ఈ నెల 28, 29 వ తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. తొలివిడత సీటు అలాట్‌మెంట్ జూన్ 6న ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 7 నుంచి 12 లోగా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలి.

రెండో విడత

జూన్ 6 నుంచి రెండో విడత రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుంది. విద్యార్థులు రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి జూన్ 13 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. జూన్ 6 నుంచి 14 వరకు వెబ్‌ఆప్షన్స్ ఇవ్వాలి. దివ్యాంగులు, ఇతర ప్రత్యేక రిజర్వేషన్లు ఉన్న వారికి జూన్ 13న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. రెండో విడత సీట్ల కేటాయింపు జూన్ 18న ఉంటుంది. సీట్లు పొందిన వారు జూన్ 19నుంచి 24లోగా ఆన్‌లైన్‌లో రిపోర్టింగ్ చేయాలి.

మూడో విడత

జూన్ 19 నుంచి మూడో విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. విద్యార్థులు రూ.400 ఫీజు చెల్లించి జూన్ 25 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అలాగే జూన్ 19 నుంచి 26 వరకు కాలేజీల వెబ్‌ఆప్షన్స్ ఇవ్వాలి. దివ్యాంగులు, ఇతర ప్రత్యేక రిజర్వేషన్లు ఉన్న వారికి జూన్ 25న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. మూడో విడత సీట్ల కేటాయింపు జూన్ 29న ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 29 నుంచి జూలై 3 లోగా రిపోర్టింగ్ చేయాలి. విద్యార్థులకు జూలై 1 నుంచి 6వరకు ఓరియెంటేషన్ తరగతులుంటాయి. ఫస్టియర్ సెమిస్టర్ తరగతులు జూలై 8 నుంచి ప్రారంభమవుతాయి.

రుణగ్రహీతల వివరాల సేకరణ

- రుణమాఫీకి ప్రభుత్వం సానుకూలత తెలపడంతో..
- రైతుల ఆధార్ నంబర్లను సేకరిస్తున్న బ్యాంకులు



మోర్తాడ్: పంటరుణాలు తీసుకున్న రైతుల ఆధార్ నంబర్లను సహకార సంఘాలు, బ్యాంకు ఉద్యోగులు సేకరిస్తున్నారు. రూ.రెండు లక్షల వరకు పంట రుణాలను ఆగస్టు 15 నాటికి మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఒక్కో రైతు కుటుంబానికి ఒక యూనిట్‌గా మాఫీ అమలు చేసేలా చర్యలు చేపట్టారని తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఆధార్ నంబర్లను సేకరించే పనిలో ఉద్యోగులు నిమగ్నం అయ్యారు. ఒక్కో రైతుకు ఒక బ్యాంకులో కాకుండా వేర్వేరు బ్యాంకుల్లో పంట రుణాలు ఉన్నాయని గుర్తించిన సర్కార్ ఒక కుటుంబానికి రూ.రెండు లక్షల మాఫీని వర్తింపజేయాలని నిర్ణయించింది. రైతులు వారి కుటుంబ సభ్యుల ఆధార్ నంబర్లను సేకరించి అనుసంధానం చేస్తే ప్రభుత్వం ఆశించిన విధంగా రుణమాఫీ ప్రక్రియను వేగంగా పూర్తి చేయవచ్చు అని బ్యాంకర్లు భావిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో జిల్లాలో 97,418 మంది రైతులకు రూ.490.72 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. అంతలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రుణమాఫీకి అర్హత ఉన్నా అనేక మందికి లబ్ధి జరుగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో పక్కాగా వర్తింపజేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎక్కడైనా రైతుల ఆధార్ నంబర్‌లు మిస్సింగ్ అయి ఉంటే రుణమాఫీకి అంతరాయం కలుగుతుందనే ఉద్దేశంతో మరోసారి సేకరిస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: ఎస్టీ విద్యార్థులు బెస్ట్ అవైలెబుల్ స్కీం కోసం దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగరావ్ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి 3, 5, 8 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల ఆదాయం పట్టణాల్లో రూ.రెండు లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు మించని వారు అర్హులన్నారు. ఈ నెల 21 నుంచి గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చని వివరించారు. జూన్ 12లోపు దరఖాస్తు చేసుకోలని, వివరాలకు 9912086022 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

'ఉపాధి'లో కోత

- 69.71 లక్షల పనిదినాలకు ప్రతిపాదనలు పంపిన అధికారులు
- 36.36 లక్షలకే అనుమతిచ్చిన రాష్ట్ర శాఖ


నూత్‌పల్లిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

డొంకేశ్వర్(ఆర్మూర్): ఉపాధి హామీ పథకంలో పని దినాలకు కోత పడింది. జిల్లా నుంచి రాష్ట్ర శాఖకు వెళ్లిన ప్రతిపాదనల్లో సగం పనిదినాలకే అనుమతి వచ్చింది. ఉపాధిహామీ కూలీలకు ఇది నిరాశ కలిగించే విషయమని చెప్పవచ్చు. అయితే జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేస్తేనే ప్రభుత్వం పని దినాల సంఖ్యను పెంచడానికి అవకాశముంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 69.71 లక్షల పనిదినాలు అవసరమని గుర్తించిన ఈజీఎస్ అధికారులు నాలుగు నెలల క్రితం రాష్ట్ర శాఖకు ప్రతిపాదనలు పంపిచారు. ఇందులో 36.36లక్షల పనిదినాలకు మాత్రమే అనుమతినిచ్చి రూ.162 కోట్లు బడ్జెట్‌ను కేటాయించారు. గతేడాదితో పోలిస్తే దాదాపు 12 లక్షల పనిదినాలు తగ్గాయి. వేసవిలో మాత్రమే ఉపాధి పనులు జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం దినసరి కూలీని రూ.300కు పెంచడంతో కూలీలు పెద్ద ఎత్తున హాజరవుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 17.96లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. అంటే జిల్లాకు నిర్దేశించిన 36.36లక్షల పనిదినాల్లో ఇంకా 18.04లక్షల పనిదినాలే మిగిలి ఉన్నాయి. పనులు జోరుగా జరుగుతున్న ఇలాంటి సమయంలో పనిదినాల్లో కోత విధించడంపై కూలీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పంపిన ప్రతిపాదనల్లో పూర్తి పనిదినాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నిత్యం 80వేల మంది పనికి..

వేసవి ఉపాధిహామీ పనులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. నీళ్లు పూర్తిగా తగ్గిపోవడంతో చెరువులు, కుంటలు, ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాల్లో కూలీలకు పనులు కల్పిస్తున్నారు. పూడికతీత కోసం గుంతలను తవ్విస్తున్నారు. జిల్లాలో మొత్తం 2,56,777 జాబ్ కార్డులు ఉండగా ఇందులో 4,85,053మంది సభ్యులున్నారు. యాక్టివ్ జాబ్ కార్డులు 1,68,299 ఉండగా ప్రస్తుతం రోజుకు జిల్లా వ్యాప్తంగా 80వేల వరకు కూలీల పనులకు వస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీల పరిధిలో 300మందికి తగ్గకుండా కూలీలు హాజరవుతున్నారు. పేమెంట్లు కూడా వారానికోసారి వారి ఖాతాల్లో జమ కావడంతో ఉపాధి పనులకే మొగ్గు చూపుతున్నారు. అత్యధికంగా ఉమ్మడి నందిపేట్ మండలంలో 5,500 మంది కూలీలు హాజరవుతున్నారు. ఇందల్వాయి, డిచ్‌పల్లి, నవీపేట్, మాక్లూర్, బోధన్, ఆర్మూర్ ఉమ్మడి మండలాల్లో సైతం కూలీలు భారీగా పనులకు వస్తున్నారు. కూలీల హాజరు శాతం మరింత పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఈజీఎస్ అధికారులకు ఆదేశాలిస్తున్నారు.

మురుగంతా చెరువుల్లోకి..


బోధన్‌లోని పాండు చెరువులోకి వెళ్తున్న మురుగు నీరు


బెల్లాల్ చెరువు పంట కాలువ(శర్బతీ కెనాల్)లో మురుగు నీరు

- కాలుష్యం కోరల్లో బోధన్ పట్టణం
- మినీ మూసీనదిలా చెక్కి, పాండు చెరువులు
- ప్రక్షాళనకు ప్రణాళిక కరువు

బోధన్: బోధన్ పట్టణంలోని చెరువులు విషతుల్యంగా మారాయి. ఒకప్పుడు స్వచ్ఛమైన నీళ్లతో బహుళ ప్రయోజనకరంగా ఉన్న తటాకాలు ప్రస్తుతం మురుగు నీరు చేరి దుర్వాసనతో కంపు కొడుతున్నాయి. పట్టణ శివారులో నిజామాబాద్ బైపాస్ రోడ్డులో పలు కాలనీలకు ఆనుకుని ఉన్న పాండు చెరువు, పట్టణ నడిబొడ్డున ఉన్న చెక్కి చెరువు ప్రస్తుతం మినీ మూసీనదిలా మారాయి. పట్టణంలోని మురుగు నీరంతా ఈ చెరువుల్లోకి వెళ్తుండటంతో చెత్తాచెదారంతో నిండిపోయాయి. ఈ చెరువుల ద్వారా వందలాది ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతుంది. వీటిలో చేపలు పట్టి 450పైగా మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారు. మురుగు నీటితో చెరువులు కాలుషితం కావడంతో రైతులు, మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్ల నుంచి ఈ పరిస్థితులు నెలకొన్న ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికార యంత్రాంగానికి స్పష్టత ఉన్న మురుగు ప్రక్షాళనకు అడుగు ముందు పడటం లేదు. నీటిపారుదల శాఖ అధికారులు చెరువుల రక్షణను పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పట్టణ పారిశుధ్య నిర్వహణ బాధ్యత ఉన్న మున్సిపల్ శాఖ అధికారులు కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.


మినీ ట్యాంక్‌బండ్‌కు ప్రతిపాదనలు

పాండు, చెక్కి చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చడానికి ఐదేళ్ల క్రితం మున్సిపల్ పాలకవర్గ సభ్యులు సర్వే చేసి ప్రతిపాదనలు పంపించారు. దాంతో చెరువుల ప్రక్షాళన జరుగుతుందని రైతులు, మత్స్యకారులు సంబురపడ్డారు. కానీ ఆ ప్రతిపాదనలకు మోక్షం లభించ లేదు. మిషన్ కాకతీయ పథకం కింద రూ.లక్షల వెచ్చించి చెక్కి చెరువు పూడికతీత పనులు చేపట్టిన ప్రయోజనం లేకుండా పోయింది. అధికారులు స్పందించి చెరువుల రక్షణకు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

పట్టణంలోని చెరువుల్లో ఆక్రమణలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పాండు చెరువు విస్తీర్ణం 102 ఎకరాలు, చెక్కి చెరువు విస్తీర్ణం 64 ఎకరాలు కాగా చెరువుల శిఖం ఆక్రమణకు గురవుతుంది. చెక్కి చెరువులో పదుల సంఖ్యలో నివాసాలు నిర్మించడంతో విస్తీర్ణం సగానికి పడిపోయిందని రైతులు అంటున్నారు. చెరువు ఏటేటా కుదించుకుపోతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో ఆక్రమణలు తొలగించేందుకు సర్వేలు చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో చెరువుల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. పట్టణ ప్రజల తాగు, సాగు నీటి ప్రధాన జల వనరు అయిన బెల్లాల్ చెరువుకు పాండు చెరువు గొలుసు కట్టు చెరువుగా ఉంది. బెల్లాల్ చెరువు నుంచి రాకాసీపేట్ మీదుగా పాండు చెరువు వరకు విస్తరించి ఉన్న పంట కాలువ (శర్బతీ కెనాల్)లో ఒకప్పుడు స్వచ్ఛమైన నీళ్లు పారేవి. ఇప్పుడు ఏడాది పొడువునా మురుగు నీరే ప్రవహిస్తోంది. మురుగు పంట కాలువలో కలిసి దుర్వాసన వస్తోంది. చెరువులు, పంట కాలువలో మురుగు పారడంతో సీజనల్ వ్యాధుల ప్రబలే ప్రమాదం ఉంది.

విషతుల్యం అయ్యాయి



మురుగు నీరు చేరి చెరువులు విషతుల్యం అయ్యాయి. చేపల పెంపకం, వేట సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చేపలు పట్టడానికి వెళ్లి అనారోగ్యానికి గురి అవుతున్నాం. అధికారులు చెరువుల ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలి.
– కోట అబ్బయ్య, పట్టణ మత్స్య సహకార సంఘ అధ్యక్షుడు

చర్యలు తీసుకుంటాం

బోధన్‌లోని చెక్కి చెరువు, పాండు చెరువుల సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. చెరువుల ఆక్రమణపై ఆర్డీవోకు లేఖ రాస్తాం. మురుగు నీటి ప్రక్షాళన అంశాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
– లోక్య నాయక్, డీఈ, నీటిపారుదల శాఖ


పట్టణం మధ్య గల చెక్కి చెరువులో చెత్తాచెదారం

క్లుప్తంగా

దారి తప్పుతున్న 'లొకేషన్'



బాన్సువాడ రూరల్: గూగుల్ లొకేషన్ ప్రకారం గమ్యస్థానాన్ని చేరుకోవాలనుకునే కొత్త వ్యక్తులు సందుల్లో, దారి ముగిసిన ప్రాంతాల్లో ఇరుక్కున్న వీడియోలు మనం సోషల్ మీడియాలో చూసి నవ్వుకుంటాం. అలాంటి ఘటనలే నిజ జీవితంలో మన కళ్లెదుటే జరిగితే విచిత్ర అనుభూతికి లోనవుతాం. కొన్ని రోజులుగా కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం బోర్లం గ్రామస్తులు ఇలాంటి ఘటనలు ప్రతిరోజు చూస్తున్నారు. హైద్రాబాద్ నుంచి గూగుల్ లొకేషన్‌లో వస్తున్న భారీ కంటైనర్లు, క్రేన్లు, ఇతర భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు బాన్సువాడ మండలం కొయ్యగుట్ట వద్దకు రాగానే దారి తప్పుతున్నారు. నేరుగా బాన్సువాడ మీదుగా బోధన్ వైపు వెళ్లాల్సిన డ్రైవర్లు షార్ట్ లొకేషన్ బోర్లం గ్రామం మీదుగా చూపిస్తుండటంతో గ్రామంలోకి ప్రవేశిస్తున్నారు. తీరా 3, 4 కిలోమీటర్లు ప్రయాణించాక గ్రామంలోని ఇరుకైన రోడ్లు, కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను చూసి తాము దారితప్పినట్లు గుర్తించి తల పట్టుకుంటున్నారు. ఆపసోపాలు పడి గ్రామస్తుల సహకారంతో వెనుదిరిగి వెళ్లి పోతున్నారు. ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటుడటంతో గ్రామం వైపు వస్తున్న వాహనాలను ఆపి మరీ మీరు దారి తప్పారంటూ సరైన డైరెక్షన్ ఇచ్చి గ్రామస్తులు వాహనాలను వెనక్కి పంపుతున్నారు.

వెబ్ సిరీస్ షూటింగ్ ప్రారంభం



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలంలోని గుండూర్ గ్రామంలో ఆదివారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కృషితో సివరపల్లి వెబ్ సిరీస్ షూటింగ్‌ను ప్రారంభించారు. మెలో డ్రామా మూవీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రొడ్యూసర్ అర్ణబ్ కుమార్, భాస్కర్ మౌర్య దర్శకత్వంలో వెబ్ సిరీస్ నిర్మిస్తున్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో షూటింగ్ చిత్రీకరణ జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. జుక్కల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో ముందుకు సాగడానికి వెబ్ సిరీస్ చిత్రీకరణ నిదర్శమని పేర్కొన్నారు.

నరసింహునికి హనుమద్వాహన సేవ



భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష్మీనృసింహ స్వామి ఉత్సవ మూర్తులను హనుమద్వాహనంపై కొలువుంచారు. ఉదయం ఆలయంలో దీపారాధన, స్వ స్తి పుణ్యావహచనం, మాతృక, మంటప దేవతాస్థాప న కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన హనుమద్వాహనంపై స్వర్ణాభరణాలంకృతులైన లక్ష్మీనృసింహ ఉ త్సవ మూర్తులను ఉంచి వైభవంగా ఊరేగించా రు. భక్తులు భక్తి పారవశ్యంతో, జయజయ ధ్వనాలు చేస్తు ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'సలహా' సమావేశాలకు స్వస్తి..!

- కమ్యూనిటీ ఆస్పత్రులలో సలహా మండలి సమావేశాలను నిర్వహించని వైనం
- ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించి ఆస్పత్రుల్లో సౌకర్యాలపై చర్చించాలనేది నిబంధన
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



మోర్తాడ్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రి

మోర్తాడ్(బాల్కొండ): ఆస్పత్రులలో సౌకర్యాలను మెరుగుపరచడం, సమస్యలను గుర్తించి పరిష్కరించడం కోసం నిర్వహించాల్సిన సలహా మండలి సమావేశాలకు ప్రజాప్రతినిధులు స్వస్తి పలికారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఆయా మండలాల ఎంపీపీలు చైర్మన్‌లుగా కొనసాగుతున్నారు. సామాజిక ఆస్పత్రులకు మాత్రం నియోజకవర్గ ఎమ్మెల్యేలు చైర్మన్‌లుగా ఇతర ప్రజాప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సలహా మండల సమావేశాలను నిర్వహించాలనే నిబంధన ఉంది. మోర్తాడ్, బాల్కొండ, డిచ్‌పల్లి, ధర్పల్లి, నవీపేట్, వర్ని, కోటగిరిలలో 30 పడకల ఆస్పత్రులు, ఆర్మూర్‌లో వంద పడకల ఆస్పత్రి, బోధన్‌లో జిల్లా స్థాయి ఆస్పత్రి ఉంది. భీమ్‌గల్‌లో కమ్యూనిటీ ఆస్పత్రి భవన నిర్మాణం కొనసాగుతుండగా వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలోనే వైద్య సేవలు కొనసాగుతున్నాయి. ఇతర మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. బోధన్ ఆస్పత్రిలో సలహా మండలి సమావేశం కొనసాగిస్తున్నారు. మిగతా ఆస్పత్రులలోనే సలహా మండలి సభ్యులు నిద్రావస్థలో ఉండటంతో సమావేశాలపై దృష్టి సారించడం లేదు. వైద్యులు సమావేశాలపై ప్రజాప్రతినిధులకు సమాచారం ఇస్తున్నా నాయకులు పెడచెవిన పెడుతుండటంతో ఇబ్బందికరమైన పరిస్థితి నెలకొంది. సలహా మండళ్లకు నిధుల కేటాయింపు లేకపోవడం కూడా సమావేశాల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయనే వాదన వినిపిస్తుంది. సలహా మండలి సమావేశాలను నిర్వహిస్తేనే వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరై రోగులకు అందుబాటులో ఉంటారని పలువురు సూచిస్తున్నారు.



ముప్కాల్ ప్రభుత్వ పాఠశాల 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



గురువులతో బోర్గాం(పి) జెడ్పీహెచ్ఎస్ 2004-05 బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వ' విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పచ్చలనడ్కుడలో 1996-97 బ్యాచ్ విద్యార్థులు



తాండూర్ జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు



నందిపేటలో 2005-06 బ్యాచ్ విద్యార్థులు

జిల్లాలో పలు పాఠశాలలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీ య సమ్మేళనం నిర్వహించారు. చాలా రోజుల తర్వాత కలుసుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఒకరి గురించి ఒకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి గౌరవించారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ముప్కాల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు(1998–99 పదో తరగతి బ్యాచ్), నాగిరెడ్డిపేట మండలం తాండూర్ జెడ్పీ పాఠశాల(2003–04 బ్యాచ్), నిజామాబాద్ నగరంలోని బోర్గాం(పి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(2004–05 బ్యాచ్), రాజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(2002–03 బ్యాచ్), వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ పాఠశాల (1996–97 బ్యాచ్), నందిపేట నవోదయ పాఠశాల(2005–06 బ్యాచ్) విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



రాజంపేట జెడ్పీహెచ్ఎస్ 2002-03 బ్యాచ్ విద్యార్థులు



కామారెడ్డి ఆదర్శ విద్యాలయం 1998-99 బ్యాచ్ విద్యార్థులు

బైపాస్‌కు మోక్షం లభించేనా ?



నవీపేట మండల కేంద్రంలో బైపాస్ రోడ్డును ప్రతిపాదించిన ప్రాంతం

- రూ.4.5 కోట్ల నిధులు మంజూరు
- పూర్తికాని భూసేకరణ

నవీపేట: నాలుగేళ్ల కిందట ఎడపల్లి మండలంలోని జానకంపేట నుంచి నవీపేట మండలంలోని ఫకీరాబాద్ వరకు రూ.55 కోట్లతో బాసర రహదారి విస్తరణ పనులు చేపట్టారు. నవీపేట మండల కేంద్రంలో ప్రమాదకర మూల మలుపులు ఉండడంతో ప్రత్యామ్నాయ మార్గాలపై రోడ్డు భవనాల శాఖ అధికారులు సమాలోచన చేశారు. ప్రమాదాల నివారణతో పాటు జానకంపేట,ధర్మారం(ఏ), నవీపేటలలో ఉన్న రైల్వేగేట్లను దృష్టిలో ఉంచుకుని బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు.

66 అడుగుల వెడల్పుతో..

బైపాస్ రోడ్డు నిర్మాణ ఆవశ్యకతపై దృష్టిసారించిన రోడ్డు భవనాల శాఖ అధికారులు మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం ముందు గల రోడ్డును బాసర రహదారికి అనుసంధానం చేయాలని ప్రతిపాదించారు. జిల్లా కేంద్రం నుంచి గుండారం, మల్కాపూర్, అనంతగిరి, జలాల్‌పూర్, మోకన్‌పల్లి, కమలాపూర్, నవీపేటల మీదుగా ఉన్న ఈ రోడ్డును బాసర రహదారికి అనుసంధానిస్తే ప్రయాణానికి సులభం అవుతుంది. 66 అడుగుల వెడల్పుతో ఫోర్‌లేన్ పనులకు రూ.4.5 కోట్లతో ప్రతిపాదనలు పంపించగా నిధులు మంజూరయ్యాయి. టీటీడీ ముందు ఉన్న రోడ్డుకు బాసర రహదారికి మధ్యలో 1.16 కిలోమీటర్ల మేర పంట భూములున్నాయి. ఆ పరిధిలోని రైతులతో చర్చించగా నలుగురు రైతులు పరిహారానికి ఒప్పుకున్నారు. ఒక రైతు గిట్టుబాటు కావడం లేదని ససేమిరా అన్నట్లు తెలిసింది. ఫలితంగా భూసేకరణ ప్రక్రియకు అవాంతరాలు ఎదురయ్యాయి. రెవెన్యూ, రోడ్డు భవనాల శాఖల అధికారుల సమన్వయలోపంతో బైపాస్ రోడ్డుకు మోక్షం లభించడం లేదు. భూసేకరణపై చేతులెత్తేసిన అధికారులు పనులపై దృష్టి సారించడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరచూ ప్రమాదాలు..

మండల కేంద్రంలోని ప్రమాదకర మూల మలుపులతో పాటు నవీపేట శివారులోని బైపాస్ అనుసంధానిత ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. బాసర రహదారిపై వాహనాల తాకిడి అధికంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రదేశంలో ఇద్దరు మృతి చెందగా పదుల సంఖ్యలో గాయపడ్డారు. నాగేపూర్–నవీపేట మధ్యలో ఫోర్‌లేన్ రోడ్డు ఉండగా ఈ ప్రదేశంలో సింగిల్ రోడ్డు ఉండడంతో వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి.

రెవెన్యూ క్లియరెన్స్ రాలేదు..

బైపాస్ రోడ్డుకు నిధులు మంజూరై రెవెన్యూ అధికారులు ఇంకా భూమిని మాకు అప్పగించలేదు. పనులకు అవసరమైన 1.16 ఎకరాల భూమిని అప్పగించాలని కలెక్టర్‌కు నివేదికలు పంపించాం. కానీ భూసేకరణ పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభం కావడం లేదు. రెవెన్యూ అధికారులతో కలిసి భూసేకరణను త్వరలో పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాం.

– రఘువీర్, ఏఈ, ఆర్అండ్‌బీ, నవీపేట

తప్పిపోయిన బాలుడి ఆచూకీ లభ్యం



బోధన్‌లో బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని గోషాల కాలనీలో ఈ నెల 14న ఇంటి వద్ద తప్పిపోయిన సిద్ధార్థ ఆచూకీ లభించిందని సీఐ వీరయ్య తెలిపారు. వివరాలు.. గోషాల కాలనీకి చెందిన సిద్ధార్థ్ ఈ నెల 14న ఉదయం 10 గంటలకు ఇంటి ముందు ఆడుకుంటానని బయటకు వెళ్లాడు. ఆడుకుంటానని చెప్పి బయటకు వెళ్లిన కుమారుడు కనిపించకుండా పోవడంతో 16న తల్లి బెంగి పద్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తుండగా నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో బాలుడి ఆచూకీ లభించిందని, ఆదివారం బాలుడిని తీసుకువచ్చి తల్లికి అప్పగించామని సీఐ తెలిపారు.

భిక్కనూరులో మరో బాలుడి అప్పగింత

భిక్కనూరు: తప్పిపోయిన బాలుడిని పట్టుకుని తల్లికి భిక్కనూరు పోలీసులు ఆదివారం అప్పగించారు. వివరాలు.. తాడ్వాయి మండలం కుప్రియాల్‌కు చెందిన మహిళ తన ఐదేళ్ల కుమారుడితో కల్సి భిక్కనూరు మండల కేంద్రంలో జరిగిన బంధువుల ఫంక్షన్‌కు హాజరైంది. బాలుడు ఫంక్షన్‌హాల్ నుంచి బయటకు వచ్చి నడుచుకుంటూ రామేశ్వర్‌పల్లి గ్రామంలోని వడ్డెర కాలనీకి చేరుకున్నాడు. అక్కడి కాలనీవాసులు బాలుడిని వివరాలు అడుగగా సరిగా మాట్లడకపోవడంతో 100 డయల్ చేసి సమాచారం అందించారు. దీంతో భిక్కనూరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ శ్రీనివాస్, రామేశ్వర్‌పల్లి గ్రామానికి వెళ్లి ఆ బాలుడిని వెంటబెట్టుకుని భిక్కనూరు వస్తుండగా బాలుడి తల్లి మేనమామ రోదించడం చూసి వివరాలు అడిగాడు. బాలుడు తన తల్లిని మేనమామ చూసి వారి వద్దకు వెళ్లడంతో..వారి వివరాలు నమోదు చేసుకుని బాలుడిని పోలీసులు అప్పగించారు.



భిక్కనూరులో బాలుడిని తల్లికి అప్పగిస్తున్న కానిస్టేబుల్

చిన్నారి ప్రాణాలు బలిగొన్న కూలర్



శృతిక (ఫైల్)

పెర్కిట్(ఆర్మూర్): వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వెళ్లిన చిన్నారిని కూలర్ బలితీసుకుంది. ఈ ఘటన ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గంగాస్థాన్‌లో నివసించే దీపిక, వినీత్ దంపతులకు ఆరేళ్ల కూతురు శృతిక ఉంది. ఎండాకాలం సెలవులు రావడంతో శృతిక పెర్కిట్‌లోని అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. శనివారం రాత్రి అమ్మమ్మ వంట పనుల్లో నిమగ్నమై ఉండగా శృతిక ఆడుకుంటూ ఇనుప కూలర్ వద్దకు వెళ్లి, దానిని తాకింది. కూలర్‌కు విద్యుత్ ప్రసారం కావడంతో శృతిక విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. అప్పటివరకు ఆడుకుంటూ సరదాగా గడిపిన చిన్నారి అంతలోనే విగత జీవిగా మారడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గోదావరి నదిలో మృతదేహం

రెంజల్(బోధన్): కందకుర్తి వద్ద గోదావరి నదిలో గుర్తు తెలియని మృతదేహం ఆదివారం సాయంత్రం కనిపించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. స్థానికులు అందించిన సమాచారంతో గ్రామానికి చేరుకుని గోదావరి నదిలోని మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మృతుడికి సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉండవచ్చని పేర్కొన్నారు.

రాగి వైర్లు దోచి ఖాళీ బుడ్డి వదిలేశారు



ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలో శివారులో ఉన్న లయన్స్ క్లబ్ వృద్ధ ఆశ్రమం దగ్గర గత రాత్రి దుండగులు ట్రాన్స్ ఫార్మర్ను ధ్వంసం చేశారు. అందులో ఉన్న రాగి వైర్లను చోరీ చేశారు. ఎప్పుడూ రద్దీగా ఉండే రహదారి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేయడంతో రైతులు ఆశ్చర్యపోయారు. ఒక రూ.లక్ష వరకు నష్టం జరిగినట్లు ట్రాన్స్‌కో అధికారులు అంచనా వేశారు. లైన్స్ క్లబ్ ప్రతినిధి బసవేశ్వర రావు ఫిర్యాదు మేరకు ఎడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు గస్తీ పెంచాలని రైతులు కోరుతున్నారు.

వెంకంపల్లిలో ఆయిల్ చోరీ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని వెంకంపల్లి గ్రామ శివారులో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్, కాపర్ తీగలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు స్థానికులు ఆదివారం తెలిపారు. గ్రామ శివారులోని 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గద్దె నుంచి తొలగించి దానిలోని ఆయిల్, కాపర్ తీగలను దొంగిలించారని వారు తెలిపారు. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

వివాహిత అదృశ్యం

బోధన్‌రూరల్: పెగడాపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత(36) అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. ఈ నెల 17న ఇంటి నుంచి వెళ్లిన ఆమె ఇంటికి తిరిగి రాలేదు. పలుచోట్ల గాలింపు చేపట్టినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన తగిరంచ రాజిరెడ్డి(43) అప్పు జేసి రెండేళ్ల కిందట దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఉపాధి దొరక్క ఆరు నెలల కిందట తిరిగి ఇంటికి వచ్చాడు. అప్పులు తీర్చే దారి లేక ఈ నెల 14న క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

క్రైం కార్నర్

ధాన్యపు రాశి ప్రాణం తీసింది



సురేందర్ గౌండ(ఫైల్)

పిట్లం(జుక్కల్): మండల కేంద్రం శివారులో జాతీయ రహదారి పక్కన గల సర్వీస్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొడప్‌గల్ మండలానికి చెందిన సురేందర్ గౌండ(38) బైక్‌పై మాసాన్‌పల్లి గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్పను గమనించకుండా పైకి ఎక్కించడంతో అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో సురేందర్ తలకు తీవ్రగాయాలు కావడంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. సురేందర్‌కు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



చిలుకమారి సంతోష్(ఫైల్)

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఖిల్లా గ్రామానికి చెందిన చిలుకమారి సంతోష్ (42) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. సంతోష్ ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరి గ్రామ శివారులోని పంట పొలం వద్దకు వెళ్లాడు. కొంత సేపటికి ఆయన కుమారుడు అఖిలేష్ పొలానికి వెళ్లి చూడగా గడ్డి నిల్వ ఉంచే షెడ్ ముందు సంతోష్ చలనం లేకుండా పడి ఉన్నాడు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చాడు. వెంటనే అక్కడకు చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది సంతోష్‌ను పరిశీలించగా.. అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కొద్ది రోజులుగా సంతోష్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసింది. సంతోష్ బీజేపీలో చురుకైన కార్యకర్తగా ఉండేవాడు. ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారంలో కూడా పాల్గొన్నాడు. సంతోష్ భార్య భాగ్య ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

మాచారెడ్డి: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన పాల్వంచ మండలం భవానిపేటలో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. భవానిపేట గ్రామానికి చెందిన పుల్లూరి భిక్షపతి(43) ఈ నెల 7న ప్రమాదవశాత్తు టీవీఎస్ మీద నుంచి పడి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): కంజర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సింగ్‌పల్లికి చెందిన జాన్కంపేట్ గంగాధర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర్ తన కుమారుడి జన్మదినం సందర్భంగా మోపాల్ నుంచి కేక్ తీసుకుని వస్తున్నాడు. అదే సమయంలో నర్సింగ్‌పల్లి వైపు నుంచి కంజర్‌కు చెందిన గుడి సంపత్‌రెడ్డి కారులో వేగంగా వస్తున్నాడు. గురుకుల పాఠశాల మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న గంగాధర్‌ను ఢీకొట్టడంతో ఆయన పక్కనున్న పంట పొలాల్లో ఎగిరిపడ్డాడు. అంతేగాకుండా నగరానికి చెందిన నదీమ్ ద్విచక్రవాహనాన్ని సైతం కారు ఢీకొట్టింది. ప్రమాదంలో గంగాధర్ చేతులు, కాళ్లు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. నదీమ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే గంగాధర్‌ను 108 వాహనంలో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


- 9 తులాల బంగారం, 15 తులాల వెండి అపహరణ



దొంగలు పగలగొట్టిన బీరువా

కామారెడ్డి క్రైం: గడిచిన రెండు రోజులుగా జిల్లా కేంద్రంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని రాజానగర్ కాలనీలోని ఓ తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆదివారం ఉదయం వెలుగు చూసింది. వివరాలు.. కాలనీలో నివాసం ఉండే శ్రీకాంత్ రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దొంగలు పడినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బీరువాలో దాచి ఉంచిన 9 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి, రూ.2 వేలు నగదు దోచుకెళ్లారని బాధితులు చెబుతున్నారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. క్లూస్ టీం బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు. కాలనీలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.జిల్లా కేంద్రంలో ఇది వరుసగా రెండో ఘటన. షేర్‌గల్లీలో శుక్రవారం అర్ధరాత్రి ఓ మహిళా దొంగ ఇంట్లోకి చొరబడి వృద్ధురాలిపై దాడిచేసి దోపిడీకి యత్నించిన విషయం మరువకముందే రాజానగర్ కాలనీలో చోరీ ఘటన వెలుగు చూడటం కలకలం రేపుతోంది. దొంగల ముఠాలు కామారెడ్డిలో సంచరిస్తున్నాయని జనం ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత



బీబీపేటలో పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

బోధన్‌రూరల్: బర్దీపూర్ శివారులో అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ ఆదివారం తెలిపారు. అక్రమంగా మట్టిను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీస్, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి మూడు టిప్పర్లను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన టిప్పర్లను రెవెన్యూ, పోలీస్ కస్టడీకు తరలించినట్లు చెప్పారు.

కూడవెల్లి వాగులో రెండు ఇసుక ట్రాక్టర్లు..

బీబీపేట: కూడవెల్లి వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మల్కాపూర్ గ్రామానికి చెందిన సామనొల్ల ప్రశాంత్, బోల్‌గాని నవీన్‌లు ఎలాంటి అనుమతులు లేకుండా కూడవెల్లి వాగులో ఇసుకను నింపుతున్నారని 100కు ఫోన్ రాగా పోలీసులు అక్కడకు చేరుకొని ఇద్దరి ట్రాక్టర్లను పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసి బైండోవర్ కోసం ఉంచినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని మహిళ, బాలుడి మృతదేహాలు లభ్యం

బాన్సువాడ: పట్టణంలోని న్యూ వీక్లీ మార్కెట్ సమీపంలో కొత్తగా నిర్మాణం చేపడుతున్న మడిగెలలో మహిళ(35), బాలుడి(8) మృతదేహాలు లభ్యమయ్యాయి. సీఐ కృష్ణ తెలిపిన వివరాలు.. ఆదివారం మడిగెలలో దుర్వాసన వస్తుందని గమనించిన స్థానికులు మృతదేహాలను చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడి వెళ్లి చూడగా మహిళ, బాలుడి మృతదేహాలు పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో శవాలకు పంచనామా చేసి ఆస్పత్రికి తరలించారు. మహిళ, బాలుడు చనిపోయి మూడు, నాలుగు రోజులై ఉండవచ్చని సీఐ అన్నారు. మహిళ ఒంటిపై లేత గోధుమ రంగు టాప్, నలుపు రంగు ప్యాంట్ ఉన్నాయని, ఆమె ఐదు ఫీట్ల ఎత్తు ఉంటుందని, బాలుడు ఆకుపచ్చ టీషర్ట్, కాషాయ రంగు నిక్కర్ ధరించి ఉన్నాడని సీఐ తెలిపారు. మృతదేహాలు బాన్సువాడ ఆస్పత్రి మార్చురీలో ఉన్నాయని, ఎవరైనా మృతదేహాల వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంప్రదించాలని సూచించారు. మహిళ, బాలుడు గత గురువారం సంత కావడంతో అదే రోజు బాన్సువాడకు వచ్చి ఉంటారని, వారు ఆత్మహత్య చేసుకున్నారా.? లేక హత్యనా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185083]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K ఫోన్: 9160900024 / 9640400073. [H-799880]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.